క్లుప్తంగా

కేసీఆర్‌ను కలిసిన మాజీ ఎంపీటీసీ



కేసీఆర్‌తో శ్రీనివాస్, కుటుంబ సభ్యులు

అక్కన్నపేట(హుస్నాబాద్): తెలంగాణ తొలి మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవల్లిలోని ఫామ్‌హౌజ్‌లో శనివారం రామవరం మాజీ ఎంపీటీసీ సభ్యుడు లింగాల శ్రీనివాస్ కుటుంబ సమేతంగా మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నట్లు శనివారం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంలేదని, వచ్చే రోజులు తమవేనని కేసీఆర్ చెప్పారని శ్రీనివాస్ తెలిపారు.

అభివృద్ధి అంటేనే హరీశ్..



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

సిద్దిపేటకమాన్: అభివృద్ధి అంటేనే హరీశ్‌రావు.. హరీశ్‌రావు అంటేనే సిద్దిపేట.. అతడిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని 37వ వార్డు బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు సామల్ల సాయిప్రేమ్, మద్దెల నర్సింహులు అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ హరీశ్‌రావుపై కాంగ్రెస్ నాయకుల వాఖ్యలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఊసరవెల్లి లాగా పార్టీలు మారిన మైనంపల్లి హన్మంతరావుకు హరీశ్‌రావు గురించి మాట్లాడే నైతికహక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సందీప్, గణేశ్, రజనీకాంత్, ఆకాశ్ పాల్గొన్నారు.

మలేషియాలో డప్పు కళా ప్రదర్శన



ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

మిరుదొడ్డి(దుబ్బాక): మలేషియా తెలంగాణ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న దశాబ్ది ఉత్సవాల్లో తెలంగాణ కళాకారులు డప్పు కళ ప్రదర్శనను మారుమోగించారు. భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ ప్రోద్బలంతో శనివారం మలేషియాలోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహం వద్ద, అలాగే ట్విన్ టవర్స్, మార్బెడ్ ఎగ్జిబిషన్ సెంటర్‌లోను కళ ప్రదర్శన నిర్వహించినట్లు ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత అందె భాస్కర్ తెలిపారు.

ఆలయానికి రూ.3లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని బస్వాపూర్‌లోని పంచముఖ లింగ సోమేశ్వర ఆలయ పునర్నిర్మాణానికి ఇద్దరు దాతలు సుమారు రూ.3లక్షల విరాళం అందజేశారు. ఆలయ అర్చకుడు పెండోట ప్రభాకరచార్యుల ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌కు చెందిన ఎన్‌ఆర్‌ఐ తుమ్మల అభినవ్‌రెడ్డి రూ.2,01,016, కావేరి శైజలనరసింహారెడ్డి రూ.1,00,116 అందించారు. కార్యక్రమంలో ఆయల కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

'అనఘ శతకం' ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అంజయ్యగౌడ్ తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాకు చెందిన ప్రముఖ కవి బండకాడి అంజయ్య గౌడ్ రచించిన 'అనఘ శతకం' పుస్తకాన్ని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తిరుపతిలోని జాతీయ సాంస్కృతిక విశ్వ విద్యాలయంలో శనివారం ఆవిష్కరించినట్లు ప్రముఖ బాల సాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం తెలిపారు. ఆయన మాట్లాడుతూ భావనా ప్రియ సాహితీ వేదిక ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సాహిత్య సభల్లో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారన్నారు. సిద్దిపేట నుంచి రచనలు సాగిస్తూ తిరుపతిలో పుస్తకావిష్కరణ చేసిన అంజయ్యగౌడ్‌ను సిద్దిపేట జాతీయ సాహిత్య పరిషత్ సభ్యులు ఐతా చంద్రయ్య, ఎన్నవెల్లి రాజమౌళి, వరుకోలు లక్ష్మయ్య, బస్వ రాజ్‌కుమార్, సింగీతం నరసింహారావు, కోణం పరశురాములు, మంచినీళ్ల సరస్వతి, ఎడ్ల లక్ష్మి, చిరంజీవి, తిరుపతి, డాక్టర్ సుధాకర్ తదితరులు అభినందనలు తెలిపారు.

హరితం.. ఆహ్లాదం..

ఆ ఇంటి ఆవరణలో అడుగు పెడితే చాలు.. పచ్చదనం కనువిందు చేస్తుంది. ఇంటి ఎదుట నాటిన అందమైన పూలు, పళ్లు, వివిధ రకాల అలంకరణ మొక్కలు చూపరులను ఆహ్వానిస్తుంటాయి. చిన్నకోడూరు మండల కేంద్రానికి చెందిన ఇట్టబోయిన ప్రవీణ్ కుమార్ వృత్తి రీత్యా పంచాయతీ కార్యదర్శి. అతడికి పర్యావరణంపై మక్కువ ఎక్కువ. దీంతో తన పొలం వద్ద, ఇంటి ఆవరణలోను అధిక సంఖ్యలో మొక్కలు నాటి వాటిని సంరక్షిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచాడు. తాను విధులు నిర్వర్తించే బెజ్జంకి మండలం తలారి వానిపల్లిని కూడా నాలుగేళ్లలో పచ్చదనంతో నింపేశాడు. దీంతో ఆ గ్రామం 2023లో అవెన్యూ ప్లాంటేషన్‌లో రాష్ట్రంలోనే ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది.

చిన్నకోడూరు(సిద్దిపేట):



వ్యవసాయ పొలం వద్ద రోడ్డుకు రెండువైపులా పచ్చదనం





ద్రాక్ష పళ్లతో ప్రవీణ్ కుమార్



ప్రవీణ్ ఇంటి ఆవరణలో మొక్కలు



పొలం వద్ద సంరక్షిస్తున్న పూలు, పళ్లు, అలంకరణ మొక్కలు

ఆదర్శంగా నిలిచిన గిరిజన విద్యార్థులు

- మంత్రి సీతక్క ప్రశంసలు
- ల్యాప్‌టాప్‌లు అందజేత

హుస్నాబాద్‌రూరల్: మారుమూల గిరిజన విద్యార్థులు జాతీయ స్థాయి విద్యా సంస్థల్లో సీట్లు సాధించి రాష్ట్ర విద్యార్థులకే ఆదర్శంగా నిలిచారని మంత్రి సీతక్క ప్రశంసించారు. హైదరాబాదులోని బంజారా భవన్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్ పరీక్షల్లో ప్రతిభ చాటిన జిల్లెలగడ్డ గిరిజన గురుకుల ప్రతిభా కళాశాల విద్యార్థులను ఆమె అభినందించి ల్యాప్‌టాప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయి చేరుకొని దేశానికి సేవ చేయాలన్నారు. గురుకులాలు దేశానికి కావల్సిన మేధావులను అందిస్తున్నాయని ఉపాధ్యాయులను అభినందించారు. విద్యార్థులు బి.అభిషేక్ ఇండోర్, ఎం.అశోక్ వారణాసి, ఆర్.సంతోష్ రాయపూర్, ఎస్.గౌతమ్ కాలికట్, విగ్నేశ్ వరంగల్, ఎస్.వెంకి అగర్తలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ బి.రాజు తెలిపారు. కార్యక్రమంలో డీఎస్.వెంకన్న, ప్రిన్సిపాల్ రాజు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందజేసిన సీతక్క

ముమ్మరంగా సమగ్ర ఇంటింటి సర్వే

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే (సామాజిక, ఆర్థిక, విద్య, రాజకీయ, కుల సర్వే) జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోను ముమ్మరంగా సాగుతోంది. అందులో భాగంగా ఆయా చోట్ల మున్సిపల్ కమిషనర్‌లు, ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు శనివారం నిర్వహించిన సర్వేను పర్యవేక్షించారు. ఎన్యుమరేటర్‌లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సర్వేతో ప్రజల స్థితిగతులు తెలిసి ప్రభుత్వం పథకాలు అమలు చేసేందుకు సరైన ప్రణాళికలు రూపొందించడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. సర్వేకు ప్రజలంతా సహకరించాలని కోరారు.



హుస్నాబాద్: సర్వేను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్



సిద్దిపేటజోన్: మున్సిపల్ చైర్మన్ ఇంటివద్ద మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్



అక్కన్నపేట(హుస్నాబాద్): సర్వేలో ఎంపీడీఓ జయరామ్ తదితరులు



కొమురవెల్లి(సిద్దిపేట): సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీరామ్‌రెడ్డి

11న సుడా ప్లాట్లకు వేలం

సిద్దిపేటఅర్బన్: మండలంలోని మిట్టపల్లిలోని సుడా మెగా లే-అవుట్‌లో మిగిలిపోయిన ప్లాట్లకు 11న సుడా కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు వైస్ చైర్మన్ ఆశ్రిత్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో నిర్వహించిన వేలంలో మిగిలిన 98 ప్లాట్లకుగాను ఈ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు సంబంధిత పత్రాలతో పాల్గొనాలని సూచించారు.

శబరిమలకు ప్రత్యేక బస్సులు

హుస్నాబాద్: శబరిమలకు వెళ్లే భక్తులు, మాలధారులకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్టు డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకనటలో పేర్కొన్నారు. సూపర్ లగ్జరీ, రాజధాని, డీలక్స్ లాంటి బస్సులు కేటాయించామని, గురుస్వాములు టిక్కెట్లు బుక్ చేస్తే ప్రయాణ చార్జీల్లో మినహాయింపు ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

సిద్దిపేటఅర్బన్: మండలంలోని మందపల్లి గ్రామంలో ఆదివారం ఉదయం 9నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని ఏడీఈ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలోని 11కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు పనుల వల్ల విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

దుబ్బాకటౌన్: పట్టణంలోని 33కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా దుబ్బాక, మున్సిపాలిటీ పరిధిలోని చెర్వాపూర్, చెల్లాపూర్ వార్డులలో, రాజక్కపేట, రేకులకుంట గ్రామాలలో ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 9.30ని.ల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏడీఈ గంగాధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ ఏది?

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని ఎల్లాయపల్లి పంచాయతీలో నిధుల దుర్వినియోగం జరిగిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ, డీపీఓలకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదని గ్రామస్తులు వాపోయారు. శనివారం వారు మాట్లాడుతూ సర్పంచ్ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డాడని గతంలో పలు మార్లు అధికారులకు ఫిర్యాదు చేయగా నామమాత్రపు విచారణ జరిపారన్నారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులపై పూర్తివిచారణ జరిపించాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి సహకరిస్తా..

మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి

గజ్వేల్‌రూరల్: నల్లపోచమ్మ ఆలయ నిర్మాణానికి తనవంతు సహకారం అందిస్తానని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు హామీ ఇచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని గుండన్నపల్లిలోని నల్లపోచమ్మ ఆలయ ప్రాంతాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయ నిర్మాణంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వాటి పరిష్కారానికి కృషి చేస్తానని గ్రామస్తులకు చెప్పారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి నాయిని యాదగిరి, నాయకులు ప్రభాకర్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, గుండన్నపల్లి గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే.. షాకే..

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల కేంద్రంలో రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చెట్లు, పొదలతో నిండిపోయింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. పక్కనే ప్రాథమిక పాఠశాల ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించాలని కోరుతున్నారు.



పొదల మధ్య విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పనుల్లో జాప్యం.. ప్రయాణానికి కష్టం



నత్తనడకన సాగుతున్న రోడ్డు పనులు

కోహెడరూరల్(హుస్నాబాద్): కోహెడ క్రాసింగ్ నుంచి మండల కేంద్రానికి వెళ్లే రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. పనులు ప్రారంభించి ఆరు నెలలు గడిచినా ఫలితం మాత్రం అనుకున్నంతగా లేదు. వాహనదారులు, రోడ్డుకు అనుకొని ఉన్న ఇళ్ల ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

దశాబ్దాల పోరాట ఫలితమే కులగణన

బీసీ సంక్షేమ సంఘం జాతీయ నేత శ్రీనివాస్‌గౌడ్

సిద్దిపేటకమాన్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన కోసం దశాబ్దాలుగా ఎన్నో పోరాటాలు చేశామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నవీన్‌గౌడ్‌తో కలిసి ఆయన మాట్లాడారు. బీసీ కులాల లెక్కలు తేల్చడానికి ఈ కులగణన జరుగుతోందని చెప్పారు. మహబూబ్‌నగర్ జిల్లా అలంపూర్ నుంచి ఆదిలాబాద్ వరకు కులగణన చైతన్య యాత్ర చేయనున్నామని వెల్లడించారు. కులగణనను ప్రతిపక్షాలు బద్నాం చేయాలని చూస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో సంఘం నేతలు పవన్, ప్రభు, సాయికిరణ్, అరుణ్, భార్గవ్‌గౌడ్, మహేశ్, నరేందర్, క్రాంతి, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. సామాజిక సర్వేను డీబీఎఫ్ స్వాగతిస్తోందన్నారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉపాధి పరిస్థితులను సర్వేలో నమోదు చేయాలని సూచించారు. అనంతరం దళిత ఉద్యమ నాయకుడు ముత్యాల భూపాల్ తండ్రి చిన్న బాలయ్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకొని ఆ కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో వేణు, పి.కిరణ్, లింగం తదితరులు పాల్గొన్నారు.



సిద్దిపేటకమాన్: మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

ప్రమాదాలకు రైతులు కారణం కావొద్దు

రూరల్ సీఐ శ్రీను



రైతులతో మాట్లాడుతున్న సీఐ శ్రీను

సిద్దిపేటరూరల్: రైతులు తమ ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టి వాహనదారుల మరణాలకు కారణం కావొద్దని సీఐ శ్రీను అన్నారు. మండల పరిధిలోని బుస్సాపూర్ రోడ్డుపై కొంతమంది రైతులు ధాన్యాన్ని పోసి వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నారనే సమాచారం మేరకు ఆయన శనివారం అక్కడికి చేరి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్లపై ధాన్యం పోయడం వల్ల రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. వ్యవసాయ బావి, ఇళ్ల వద్ద గాని, ఇతర ప్రదేశాలలో ధాన్యం ఆరబెట్టుకోడానికి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. రోడ్లపై ధాన్యం పోసి నల్ల కవర్‌లు కప్పి ఉంచడం, వాటి చుట్టూ రాళ్లు పెట్టడం వల్ల అది గమనించని వాహనదారులు ఢీకొట్టి చనిపోతున్నారని, రోడ్లపై ధాన్యం ఆరబోసే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సైరన్‌లు బిగిస్తే చర్యలు తప్పవు

ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్

సిద్దిపేటకమాన్: ప్రభుత్వ అనుమతి లేకుండా సొంత వాహనాలకు పోలీసు సైరన్‌లు బిగించవద్దని ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం ఆయన సిబ్బందితో కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆరు వాహనాలకు సైరన్‌లు తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతి లేకుండా ప్రైవేటు వాహనాలకు, సొంత వాహనాలకు పోలీసు సైరన్‌లు బిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సైరన్‌లు ఉన్న వాహనదారులు వాటిని వెంటనే తొలగించాలని సూచించారు. స్పెషల్ డ్రైవ్‌లో గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళి, సిద్దిపేట ట్రాఫిక్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి, ఏఎస్ఐలు ఉమేశ్, సదాశివరావు, జగదీశ్వర్, హెడ్ కానిస్టేబుళ్లు రఘు, కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



సైరన్‌లు తొలగింపజేస్తున్న ప్రవీణ్‌కుమార్

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి



మాట్లాడుతున్న యాదగిరి

హుస్నాబాద్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీ అభ్యర్థులు సత్తా చాటాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి యాదగిరి కార్యకర్తలు, నాయకులకు పిలుపునిచ్చారు. బీఎస్పీ కార్యాలయంలో శనివారం సభ్యత్వ నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 50 వేల సభ్యత్వాలు చేయించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఓం ప్రకాశ్, శంకర్, రవీందర్ గౌడ్, రాజు, మల్లేశ్, సుధాకర్, రవీందర్, బాబు తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ఆ కార్యాలయాలను పునరుద్ధరించండి**

హుస్నాబాద్: తరలిపోయిన కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న కార్యాలయాలను పునరుద్ధరించాలని భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ ఇన్‌చార్జి కవ్వ వేణుగోపాల్‌రెడ్డి ఒక ప్రకనటలో కోరారు. అప్పటి కేంద్ర మంత్రి వెంకటస్వామి హయాంలో బీడీ వర్కర్స్ డిస్పెన్సరీ, సెంట్రల్ లేబర్ మినిస్ట్రీ, వావిలాల గ్రామోద్యోగ్ బండార్, నేషనల్ టెక్స్‌టైల్స్ కార్పొరేషన్, రిటైల్ కౌంటర్ ఏర్పాటు చేశారని, అయితే కొద్ది రోజుల నిర్వహణ తర్వాత ఈ కార్యాలయాలను ఎత్తివేశారని వాపోయారు. ఆదివారం పర్యటించనున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవ చూపి కేంద్ర ప్రభుత్వ కార్యాలయాలను పునరుద్ధరించేలా చూడాలని కోరారు.

◆ **బీజేపీలోకి యువకులు**

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల కేంద్రానికి చెందిన పలువురు యువకులు బీజేపీ సిద్దిపేట అసెంబ్లీ ఇన్‌చార్జి దూది శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో శనివారం బీజేపీలో చేరారు. పార్టీ కండువా కప్పి వారిని సాదరంగా ఆహ్వానించారు. శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యమన్నారు. సాయికిరణ్, అమర్, మహేశ్, విష్ణు, రాజేశ్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

◆ **గురువుల బాధ్యత గొప్పది**

మిరుదొడ్డి(దుబ్బాక): విద్యార్థులను తీర్చిదిద్దడంలో గురువుల బాధ్యత చాలా గొప్పదని కాంగ్రెస్ నాయకుడు చెరుకు అమరేందర్‌రెడ్డి అన్నారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు మద్దెల రాజేశ్ అధ్యక్షతన మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన వారిని శనివారం ఘనంగా సన్మానించారు. మాజీ ఎంపీపీ సాయిలు, లక్ష్మి, భూమాగౌడ్, జైపాల్‌రెడ్డి, భూపాల్‌గౌడ్, భూపతి గౌడ్, మహేందర్, సాజిత్, హర్షత్, కిష్టయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

◆ **బాధితురాలికి ఆర్థిక సాయం**

గజ్వేల్‌రూరల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పేద యువతికి రాణీ మైత్రి అసోసియేషన్ ప్రతినిధులు ఆర్థిక సాయం అందించి భరోసా ఇచ్చారు. మండల పరిధిలోని రిమ్మనగూడకు చెందిన చంద్రకళ ప్రభుత్వాసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ విధులు నిర్వహించి ఇంటికి వెళ్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ విషయం తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు శనివారం ఆమెకు ఆర్థిక సాయం అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు బండ్ల స్వామి, రవి కుమార్ పాల్గొన్నారు.

◆ **200 మందికి వైద్య పరీక్షలు**

కొండపాక(గజ్వేల్): కొండపాకలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన ఆసియన్ ఇన్స్‌స్ట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, యూరాలజీ అడ్మినిస్ట్రేటర్ జీకే రాజు ఆధ్వర్యంలో మూత్రపిండాల వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు గౌతం, జార్జి ములార్, సందీప్ కుమార్, గౌతం కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **కులగణనతో బీసీలకు ఒరిగేదేమీలేదు**

గజ్వేల్‌రూరల్: కులగణనతో బీసీలకు ఒరిగేదేమీ లేదని, రిజర్వేషన్లను పక్కాగా అమలు చేసినపుడే బీసీలకు న్యాయం జరుగుతుందని బీసీ సంఘం నాయకులు కల్యాణ్‌కర్ నర్సింగరావు, మల్లేశం గౌడ్, ఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. గజ్వేల్‌లో శనివారం వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీల విషయంలో కమిషన్లు, కమిటీల పేరుతో కాలయాపన చేసే ప్రభుత్వాలు ఈడబ్ల్యూఎస్ అంశంలో వెంటనే అమలు చేస్తున్నాయని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, కరీం, శంకర్, షరీఫ్, రాములు, ప్రవీణ్, కర్ణాకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ **జేఏసీ కమిటీల నియామకం**

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన లక్ష్యంతో ఏర్పడిన జేఏసీ నాలుగు మండలాల కమిటీలను నియమించినట్లు చైర్మన్ రామగళ్ల పరమేశ్వర్ తెలిపారు. స్థానిక జేఏసీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ నాలుగు మండలాల కమిటీలు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. చేర్యాల కన్వీనర్‌గా ఆడెపు నరేందర్, కో కన్వీనర్లుగా కాటం సురేందర్, చెవిటి లింగం, పోలోజు కుమారస్వామి, చేర్యాల రూరల్ కమిటీ కన్వీనర్‌గా నర్ర మహేందర్‌రెడ్డి, కో కన్వీనర్‌గా మంజ మల్లేశం తదితరులను ఎంపికచేసినట్లు చెప్పారు. ఆయన వెంట ఉమారాణి, బీరయ్య, అశోక్ తదితరులున్నారు.

◆ **సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత**

అక్కన్నపేట(హుస్నాబాద్): సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు భరోసాగా నిలుస్తోందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు జంగపల్లి అయిలయ్య, మాజీ సర్పంచ్ ముత్యాల సంజీవ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు శనివారం పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ త్వరలో ఇందిరమ్మ గృహాలను మంజూరు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భానోతు జయరాం, ఆర్ఐ యాదగిరి, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.